సాక్షి
జగిత్యాల
మంగళవారం : 25 : జూలై : 2023



కొనసాగుతున్న రిలే దీక్షలు

జగిత్యాలటౌన్: ప్రభుత్వ పాఠశాలల స్వీపర్లు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే దీక్షలు సోమవారం కూడా కొనసాగాయి.



సంకల్పయాత్రకు మద్దతు

జగిత్యాల: టీఎస్‌సీపీఎస్‌ఈయూ చేపట్టిన పాత పింఛన్ సాధన సంకల్పయాత్రకు నేతలు జితేందర్, శ్రీదీప్ మద్దతు ప్రకటించారు.

గరిష్ఠం/కనిష్ఠం
29.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘాలతో కమ్ముకుని ఉంటుంది. జిల్లావ్యాప్తంగా మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఎస్సారెస్పీకి జలకళ



జలకళ సంతరించుకున్న ఎస్సారెస్పీ

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాకు సాగు, తాగునీరు అందించే శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నీటి నిల్వలు 62.901 టీఎంసీలకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1,091.00 అడుగులు కాగా, సోమవారం సాయంత్రం 5 గంటల వరకు 1,083.70 అడుగులకు చేరింది. నీటి నిల్వ సామర్థ్యం 90.3 టీఎంసీలు కాగా ప్రస్తుతం 62.901 టీఎంసీలకు చేరింది. ప్రాజెక్టులోకి 19,722 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 935 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉంది.

త్వరితగతిన పథకాల గ్రౌండింగ్

జగిత్యాల: అభివృద్ధి, సంక్షేమ పథకాల యూనిట్లను త్వరితగతిన గ్రౌండింగ్ చేయాలని కలెక్టర్ యాస్మిన్ బాషా సూచించారు. తన కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. దళితబంధు, ఎస్సీ, బీసీ, మైనార్టీ పథకాల లబ్ధిదారుల యూనిట్లను వెంటనే గ్రౌండింగ్ చేయాలన్నారు. రెండోవిడత గొర్రెల యూనిట్లను గ్రౌండింగ్ చేసి అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని అన్నారు. ముఖ్యమంత్రి ప్రకటించిన ఈ యూనిట్‌కు త్వరలోనే విధివిధానాలను జారీచేస్తామని తెలిపారు. దళితబంధు కింద నియోజకవర్గానికి 1,100 మంది చొప్పున లబ్ధిదారులను ఎంపిక చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామపంచాయతీలు, మున్సిపల్ యంత్రాంగం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని చెప్పారు. హరితహారం ద్వారా నిర్దేశిత లక్ష్యం మేరకు మొక్కలు నాటాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: స్థానిక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఉద్యోగ నియామకాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని మెడికల్ సూపరింటెండెంట్ రాములు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏఆర్‌టీ సెంటర్‌లో కాంట్రాక్టు ప్రాతిపదిక రెండు మెడికల్ ఆఫీసర్ పోస్టులు భర్తీ చేస్తామన్నారు. ఎంబీబీఎస్, ఎండీ, డిప్లొమా పూర్తిచేసిన వారు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాలతో ఆగస్టు 1 నుంచి 8వ తేదీ సాయంత్రం 4 గంటల్లోగా ఏఆర్‌టీ సెంటర్, రూమ్ నంబరు 41లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

'కార్మికులపై చిన్నచూపు'



మద్దతు తెలుపుతున్న సుతారి రాములు

జగిత్యాలరూరల్: పంచాయతీ కార్మికులపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు విమర్శించారు. రాయికల్‌లో 32 గ్రామపంచాయతీల కారోబార్లు, పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె శిబిరాన్ని ఆయన సోమవారం సందర్శించి మద్దతు తెలిపారు. గ్రామపంచాయతీ కార్మికులు సమ్మె చేస్తున్నా సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు నెరవేరడం లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజేందర్‌ప్రసాద్, మహిపాల్, శంకర్, శ్రీను, రమేశ్, జలేందర్, భూమయ్య, లక్ష్మి, గంగు, భాగ్యరాజం, అన్నపూర్ణ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటరు జాబితా సవరణ



మాట్లాడుతున్న ఆర్డీవో రాజేశ్వర్

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): ఓటరు జాబితా సవరణ పకడ్బందీగా చేపట్టాలని ఆర్డీవో రాజేశ్వర్ సూచించారు. స్థానిక రైతువేదికలో సోమవారం బీఎల్‌వోలకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ, కొత్త ఓటర్ల నమోదు, తొలగింపులు, సవరణలు తదితర అంశాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. అనంతరం ప్రొజెక్టర్ ద్వారా మాస్టర్ ట్రైనర్లు చిన్నయ్య, లింబగిరి అవగాహన కల్పించారు. తహసీల్దార్ రవికిరణ్‌కుమార్, ఆర్‌ఐలు రమేశ్, గంగాధర్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

శివారు.. బేజారు



గుంతల్లో నీరు నిలిచి అధ్వానంగా ఉన్న ఈ రోడ్డు మెట్‌పల్లి మున్సిపల్ బాలకృష్ణానగర్‌లోనిది. కనీసం డ్రైనేజీలు కూడా లేవు. మొన్నటినుంచి కురుస్తున్న వానలతో రోడ్డు ఇలా బురదగా మారింది. అన్ని వీధుల్లోనూ ఇదే దుస్థితి ఉంది. వర్షాకాలం కావడంతో రాకపోకలకు నరకం కనిపిస్తోంది.



ఇది మెట్‌పల్లి బల్దియా 12 వార్డులోని రోడ్డు. ఏటా చిన్నవర్షానికే ఇలా బురదగా మారుతోంది. సీసీ రోడ్డు నిర్మించాలని అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితంలేదు. నాలుగురోజులపాటు కురిసిన వానలతో ఇలా చిత్తడిగా మారింది. బల్దియా శివారులోని కాలనీల్లో చిత్తడైన రోడ్లకు ఇది నిదర్శనం.

- అభివృద్ధి పట్టని పాలకులు
- బురద రోడ్లు.. నీటిగుంతలు
- రాకపోకలకు తీవ్ర అంతరాయం
- ఏటా వర్షాకాలంలో ఇదే పరిస్థితి
- చివరి కాలనీలపై మున్సిపల్ అధికారుల చిన్నచూపు

మెట్‌పల్లి(కోరుట్ల): జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురితోపాటు రాయికల్ మున్సిపాలిటీల శివారు కాలనీల్లో మౌలిక వసతులు కరువయ్యాయి. ముఖ్యంగా ఏటా వర్షాకాలంలో రహదారుల పరిస్థితి అధ్వానంగా తయారవుతోంది. చిన్నపాటి వర్షానికే వీధులన్నీ చిత్తడిగా మారుతున్నాయి. మట్టి రహదారులను సీసీ రోడ్లుగా మార్చకపోవడంతో.. రోజులతరబడి నీరు నిలిచి బురదగా మారుతున్నాయి. తద్వారా ప్రజారవాణాకు తీవ్రఆటంకం కలుగుతోంది.

5 మున్సిపాలిటీలు.. 40 కాలనీలు

- ➜ జిల్లాలో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి మున్సిపాలిటీలు ఉన్నాయి.
- ➜ వీటి పరిధిలో విలీన గ్రామాలు, కాలనీలు కలిపి సుమారు 40 వరకు ఉన్నాయి.
- ➜ ఈ కాలనీల్లో మౌలిక వసతులు.. ముఖ్యంగా రోడ్ల అభివృద్ధిపై అధికారులు, పాలకుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారుతోంది.
- ➜ ఏటా వర్షాకాలంలో కాలనీల్లోని మట్టిరోడ్లు బురదగా మారుతున్నాయి.
- ➜ వాహనదారులు, కాలినడకన వెళ్లేవారు నానా అవస్థలు పడుతున్నారు.
- ➜ ఏమాత్రం పట్టు తప్పినా ప్రమాదానికి గురి కావాల్సిన దుస్థితి ఎదుర్కొంటున్నారు.
- ➜ ఇప్పటికే పలుచోట్ల స్వల్ప ప్రమాదాలు కూడా చోటుచేసుకున్నాయి.

నిధుల కేటాయింపు అంతంతే

మున్సిపాలిటీల్లో మౌలిక వసతుల కల్పన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా నిధులు మంజూరు చేస్తున్నాయి. ఇందులోంచి అత్యధికంగా అభివృద్ధికి దూరంగా ఉన్న శివారు కాలనీలకు కేటాయించాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. కానీ, ఈ విషయంలో నిర్లక్ష్యం చోటుచేసుకుంటోంది. ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించక రోడ్లు అభివృద్ధికి నోచుకోవడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపాలిటీల్లో సుందరీకరణ కోసం రూ.50కోట్ల చొప్పున రూ.150కోట్లు ఇటీవల కేటాయించింది.

➜ ఈ నిధుల నుంచి కూడా శివారు కాలనీల అభివృద్ధికి ఆశించినస్థాయిలో కేటాయించలేదనే విమర్శలు ఉన్నాయి.

ఇబ్బంది పడుతున్నాం



మా కాలనీ శివారులో ఉంది. రోజురోజుకూ కొత్త ఇళ్ల సంఖ్య పెరుగుతోంది. కానీ, రోడ్లు, డ్రైనేజీలు నిర్మించడం లేదు. వర్షాకాలంలో రోడ్లన్నీ బురదగా మారుతున్నాయి. రాకపోకలకు ఇబ్బందిగా ఉంది.

– పడాల లక్ష్మి, స్థానికురాలు, బాలకృష్ణనగర్, మెట్‌పల్లి

నిధులు కేటాయించాలి



మా కాలనీ గతంలో గ్రామ పంచాయతీలో ఉండేది. మున్సిపాలిటీలో కలపడంతో అన్ని వసతులు సమకూరుతాయని ఆశించాం. కానీ, నిధులు తక్కువ కేటాయిస్తున్నారు. సమస్యలు పరిష్కారం కావడం లేదు.

– ఆగమయ్య, స్థానికుడు, టీచర్స్ కాలనీ, మెట్‌పల్లి

మహిళల రక్షణ కోసమే షీటీం

- ఎస్పీ భాస్కర్



మాట్లాడుతున్న ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: మహిళల రక్షణ కోసం షీటీం సమర్థవంతంగా పనిచేస్తోందని ఎస్పీ భాస్కర్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో షీటీం యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ బృందం పనితీరుపై సమీక్షించారు. అన్యాయానికి గురైన విద్యార్థినులు, మహిళలు ధైర్యంగా ఫిర్యాదు చేస్తే దోషులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మానవ అక్రమ రవాణా నియంత్రణకు యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ యూనిట్ ఏర్పాటు చేశామని తెలిపారు. మహిళల భద్రత, ఆకతాయిల వేధింపుల నుంచి రక్షణ కోసం పోలీసు శాఖ అధిక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ఫేస్‌బుక్, వాట్సప్, ఇన్‌స్టాగామ్ తదితర సామాజిక మాధ్యమాల వినియోగంలో చాలాజాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఫొటోలు, వీడియోలు పోస్ట్ చేసే సమయంలో వ్యక్తిగత భద్రతపై దృష్టి సారించాలని చెప్పారు. బాధితులు 87126 70783, లేదా డయల్ 100కు ఫోన్‌చేసి సమాచారం ఇస్తే సత్వరమే స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. జిల్లాలో గత ఆరునెలల్లో షీటీం ద్వారా కళాశాలు, పాఠశాలల్లో ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో, షీటీం యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్‌పై 69 అవగాహన సదస్సులు నిర్వహించామని పేర్కొన్నారు. సుమారు 7 వేల మంది విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. షీటీం ద్వారా 27 ఫిర్యాదులు రాగా, 13 మందిపై మూడు కేసులు నమోదు చేశామని వివరించారు. మహిళలు, విద్యార్థినులను వేధిస్తున్న 11 మందికి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చామని అన్నారు. ఎస్బీ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రావు, షీటీం ఎస్సై వెంకటేశ్వర్లు, ఏఎస్సై అలీబేగ్, మహిళా కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం

వివిధ సమస్యలతో పోలీసులను ఆశ్రయించే వారికి సత్వర న్యాయం చేసేందుకే గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నామని ఎస్పీ భాస్కర్ అన్నారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో 37 మంది నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి



కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న అడ్లూరి లక్ష్మణ్ కుమార్

- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

వెల్గటూర్(ధర్మపురి): గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికుల ఉద్యోగాలను వెంటనే క్రమబద్ధీకరించాలని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కార్మికులు 19 రోజులుగా సమ్మె చేస్తున్నా మంత్రి కొప్పుల ఈశ్వర్ ఇటువైపు కన్నెత్తి చూడడం లేదని విమర్శించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో చేపట్టిన పంచాయతీ పారిశుధ్య కార్మికుల సమ్మె శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. కరోనా కష్టకాలంలో తమ ప్రాణాలు పణంగా పెట్టి గ్రామాలను శుభ్రం చేశారని గుర్తుచేశారు. అలాంటి వారిని నిర్లక్ష్యం చేయడం శోచనీయమన్నారు. సమ్మెతో గ్రామాల్లో పారిశుధ్యం లోపిస్తోందని తెలిపారు. వర్షాకాలం కావడంతో విషజ్వరాలు ప్రబలు ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, సర్పంచులు మేరుగు మురళిగౌడ్, జగదీశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ అనుమాల మంజుల, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంద్ర శ్రీకాంత్‌రావు, మండల అధ్యక్షుడు పూదరి రమేశ్ బీసీ సెల్ అధ్యక్షుడు బందెల ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

మొర ఆలకించండి..

సమస్యలు పరిష్కరించండి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ యాస్మిన్‌బాషా

- అధికారులకు అభాగ్యుల విన్నపం
- ప్రజావాణికి వెల్లువెత్తిన అర్జీలు
- దరఖాస్తులు స్వీకరించిన కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాలటౌన్: సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం చేపట్టిన ప్రజావాణికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వివిధ ప్రాంతాల నుంచి అభాగ్యులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అధికారులకు అర్జీలు సమర్పించారు. దరఖాస్తులు స్వీకరించిన కలెక్టర్ యాస్మిన్ బాషా అధికారులతో మాట్లాడుతూ.. ప్రజావాణి సమస్యలకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వాటిని తొణమే పరిష్కరించాలని సూచించారు.

సముచిత స్థానం కల్పించండి

జగిత్యాల: సమాజంలో ట్రాన్స్‌జెండర్లకు సముచితస్థానం కల్పించేందుకు గుర్తింపుకార్డులు అందిస్తున్నామని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. 20 మంది ట్రాన్స్‌జెండర్లకు కలెక్టరేట్‌లో గుర్తింపు కార్డులు అందజేసి మాట్లాడారు. నిబంధనల మేరకు, చట్ట ప్రకారం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో వారికి ఆర్థిక సాయం అందిస్తామని చెప్పారు. జిల్లాలో 18 ఏళ్ల వయసు నిండిన ట్రాన్స్‌జెండర్లకు ఓటుహక్కు కల్పిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు 17 మంది పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేశామని తెలిపారు. అదనపు కలెక్టర్లు బీఎస్ లత, దివాకర, ఆర్డీవోలు పాల్గొన్నారు.

బిడ్డను కాపాడండి



మెట్‌పల్లి ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యంతో ఆరోగ్యస్థితి బాగాలేక నా బిడ్డ పుట్టింది. డెలివరీ కోసం మెట్‌పల్లి ప్రభుత్వ వైద్యశాలలో చేరితే.. నార్మల్ డెలివరీ పురిట ఆలస్యం జేసిండ్రు. నా బిడ్డ నరాలు చచ్చుబడిపోయినయి. నా కూతురు ఆరోగ్యం బాగు జేసేందుకు అనేక ఆస్పత్రుల్లో చూపెట్టిన. రూ.3లక్షల వరకు ఖర్చు చేసిన. ఎలాంటి ఫలితం లేదు. అధికారులే ఆదుకోవాలె.

– దమ్మన్నపేట లయ, జగ్గసాగర్

ఇంటిని కబ్జా జేసింద్రు



మా ఆయన దివంగత గాలిపెల్లి బ్రహ్మయ్య నుంచి వారసత్వంగా వచ్చిన ఇంటిలో నా వాటాను నాకు తెలియకుండానే కబ్జా జేసింద్రు. గ్రామ పెద్దలను కలిసినా ప్రయోజనం లేదు. మా ఆయన సోదరుడు గాలిపెల్లి నారాయణ కోడలు గాలిపెల్లి లక్ష్మి నాకు తెలియకుండానే గ్రామపంచాయతీ రికార్డుల్లో ఆమె పేరు ఎక్కించింది. నాకు 71ఏళ్లు. ఇంటిలో నా వాటా నాకు ఇప్పించండి.

– గాలిపెల్లి రత్తమ్మ రంగపేట, సారంగాపూర్

ఏ దిక్కూలేదు.. ఆదుకోండి



మాకు మా కుటుంబాల అండలేదు. సమాజంలో చీదరింపులు, అవహేళనలు ఎదురవుతున్నయి. పొట్టకూటి కోసం భిక్షాటన చేస్తున్నం. అణగారిన వర్గాలు, అభాగ్యులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సర్కార్.. మాకు కూడా ఆసరా పింఛన్లు వర్తింపజేయాలె. డబుల్‌బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలె. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్య సేవలు అందించాలె. విద్య, ఉద్యోగ రంగాల్లో ప్రత్యేక రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలె.

– ట్రాన్స్‌జెండర్లు

వీఆర్‌ఏపై చర్య తీసుకోండి



మా ఊరు శివారు సర్వేనంబరు 66అ/2లోని 8గుంటల నా సొంత భూమిని వీఆర్‌ఏ చౌడమల్ల మల్లయ్య కబ్జా చేశారు. భూ రికార్డులప్రక్షాళనలో భాగంగా ఉన్నతాధికారుల అండతో పట్టా పొందాడు. అక్రమంగా పొందిన పట్టాను రద్దుచేసి మల్లయ్యపై చర్యలు తీసుకోండి. నాకు న్యాయం చేయండి.

– పింజరి పోచయ్య, రాగోజిపేట

మత్తడి మూసేస్తున్నరు



మా పట్టణంలోని రవీంద్రరోడ్డు ప్రాంతంలో సుమారు 53.30 ఎకరాల్లో తాళ్ల చెరువు విస్తరించి ఉంది. అందులో దాదాపు ఆరు ఎకరాలను కొందరు కబ్జా చేసింద్రు. రోడ్డు వేసి మత్తడి మూసివేయాలని చూస్తున్నరు. ఇలా చేస్తే మా ఉపాధి పోతుంది. కబ్జాదారుల నుంచి భూమిని రక్షించండి. చెరువుకు హద్దులు ఏర్పాటు చేయండి.

– మత్స్యకారులు, కోరుట్ల

ఐటీ రంగంలో అగ్రగామి

- కేటీఆర్‌తోనే రాష్ట్రానికి రూ.వేలకోట్ల పెట్టుబడులు
- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్
- ఘనంగా మంత్రి పుట్టినరోజు వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ తదితరులు

జగిత్యాల: ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ నిర్ణయాలతోనే ఐటీ రంగంలో తెలంగాణ అగ్రగామిగా నిలిచిందని, దేశవిదేశాల నుంచి రూ.వేల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. స్థానిక బీఆర్ఎస్ కార్యాలయంలో మంత్రి కేటీఆర్ పుట్టినరోజు వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నూతన పురపాలక చట్టంతో మున్సిపాలిటీలు అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన వసంత

జగిత్యాలజోన్: మంత్రి కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా స్థానిక జెడ్పీ క్యాంప్ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత దంపతులు మొక్కలు నాటారు. సంరోణకు చర్యలు తీసుకున్నారు.

ఘనంగా మంత్రి కేటీఆర్ పుట్టినరోజు వేడుకలు

మెట్‌పల్లి(కోరుట్ల): మున్సిపల్, ఐటీ శాఖమంత్రి కేటీఆర్ పుట్టిన రోజు వేడుకలను పట్టణంలో ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ కార్యాలయంలో ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం పార్టీ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మారు సాయిరెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ చంద్రశేఖర్‌రావు, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మొక్కనాటుతున్న ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు

అయిలాపూర్‌లో..

కోరుట్లరూరల్: అయిలాపూర్ గ్రామంలో మంత్రి కేటీఆర్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. రైతువేదికలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీసీఆర్బీ సీఐ రాజారెడ్డి

జగిత్యాలక్రైం: జిల్లా డీసీఆర్బీ సీఐగా డి.రాజారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ భాస్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

పలువురు ఏసీపీల బదిలీ

కరీంనగర్ క్రైం: కరీంనగర్ ఉమ్మడి జిల్లా పరిధిలో పలువురు ఏసీపీలను బదిలీ చేస్తూ రాష్ట్ర డీజీపీ కార్యాలయం నుంచి సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ ఏసీపీగా కె.గిరికుమార్, కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ ఏసీపీగా ఉన్న జె.విజయసారధిని డీజీపీ కార్యాలయానికి, వి.మాధవిని కరీంనగర్ సీసీఎస్ ఏసీపీగా, కరీంనగర్ సీసీఎస్ ఏసీపీగా ఉన్న కె.శ్రీనివాస్‌ను డీజీపీ కార్యాలయానికి, టి.మల్లారెడ్డిని రామగుండం టాస్క్‌ఫోర్స్ ఏసీపీగా, జి.వెంకటేశ్వర బాబును జగిత్యాల సీసీఆర్‌బీ ఏసీపీగా బదిలీ చేశారు.

'పూర్తిస్థాయి కమిషనర్‌ను నియమించాలి'

జగిత్యాల: పట్టణ మున్సిపాలిటీలో పూర్తిస్థాయి కమిషనర్‌ను నియమించాలని కౌన్సిలర్ జయశ్రీ అడిషనల్ కలెక్టర్ దివకరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో సీడీఎంఏ ద్వారా యూడీఆర్ఐ ఉన్నా అతనిని సమాచార హక్కు చట్టం విభాగానికి బదిలీ చేసి జూనియర్ అసిస్టెంట్లను ఆర్ఐలుగా నియమించారని, వీరిపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఆర్వోగా ఉన్న అతను సీడీఎంఏ ద్వారా కాకుండా కోర్టు ద్వారా ఉత్తర్వులు తెచ్చుకుని చేరినట్లు పేర్కొన్నారు. అధికారులు సమయపాలన పాటించడం లేదని, సెల్ఫ్ అసెస్మెంట్లు 600లకు పైగా పెండింగ్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు. రెవెన్యూ విభాగంలో ఖాళీస్థలాలకు ఇంటి నంబర్లు ఇచ్చినట్లు ఆరోపణలున్నాయని, దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని కోరారు.

ప్రహరీ కూల్చివేతపై పోలీసులకు ఫిర్యాదు



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై కిరణ్‌కుమార్

కథలాపూర్: మండలకేంద్రంలో మున్నూరు కాపు మండల సంఘానికి చెందిన ప్రహరీని కూల్చివేసిన ఘటనలో సంఘం సభ్యులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు ట్రాక్టర్‌తో ప్రహరీని కూల్చి వేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఎస్సై కిరణ్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి సంఘం సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

కాటేస్తున్నాయ్..

- జిల్లాలో పెరుగుతున్న పాముకాటు కేసులు
- నిత్యం ప్రమాదాలబారిన పడుతున్న రైతులు
- వానాకాలంలో జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్న వైద్యులు



జగిత్యాల: కథలాపూర్ మండలం భూషణ్‌రావుపేటకు చెందిన గోపిడి రాజు (57) అనే మహిళా రైతు తనపంట చేనులో ఈనెల 2న పెసరకాయ తెంపేందుకు వెళ్లగా పాము కాటువేసింది. ఆస్పత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషమించి మృతిచెందింది. జిల్లాలో ఇలాంటి కేసులు అత్యధికంగా నమోదవుతూ ఉన్నాయి. వానాకాలంలో విషసర్పాలు ఎక్కువగా సంచరిస్తుంటాయి. జూన్ – సెప్టెంబర్ మధ్య వర్షాకాలం కావడంతో రైతులు ఎక్కువగా పంటపొలాల్లో పనుల్లో బిజీగా ఉంటారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో నాగుపాము, కట్లపాము, రక్తపింజర పాములే ఎక్కువగా తిరుగుతుంటాయి. ఇళ్లలో కంటే ఎక్కువగా పొలం గట్లు, చెట్ల మొదళ్లు, ఇంటి పరిసర ప్రాంతాల్లో తిరుగుతుంటాయి. సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రమాదాల బారినపడే అవకాశం ఉంది. జూన్, జూలైలో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో 45 కేసులు నమోదు కాగా, పీహెచ్‌సీల్లో 50కి పైగా కేసులు నమోదయ్యాయి. పాముకాటు వేసినపుడు సకాలంలో ఆస్పత్రికి వెళ్లకపోతే మృత్యువాత పడే అవకాశం ఉందని వైద్యులు సూచిస్తున్నారు.

నాడీవ్యవస్థపై ప్రభావం

పాముకాటు వేసిన తర్వాత విషం శరీరంలోకి వెళ్తున్న కొద్దీ నాడీ వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. దీంతో శ్వాసకోశపై ఇబ్బందులు ఏర్పడి ఫలితంగా పరిస్థితి విషమంగా ఉంటుంది. ఒక్కో విష సర్పానికి ఒక్కో తీరు ఉంటుంది.

అందుబాటులో ఔషధం

ముఖ్యంగా పాముల విరుగుడుకు ఒకేరకమైన ఔషధం ఇస్తుంటారు. యాంటీ స్నేక్ వీనమ్ ఇస్తారు. ఎంత త్వరగా అందుబాటులోకి వెళ్తే అంత త్వరగా వ్యక్తి కోలుకునే అవకాశం ఉంటుంది.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

పాముకాటుకు గ్రామాల్లో ఎక్కువగా రైతులే బలవుతున్నారు. పొలం వద్దకు వెళ్లేటప్పుడు రాత్రిపూట టార్చిలైట్లు తీసుకెళ్లాలి. పొలం గట్లు, కళ్లాల వద్ద కర్ర చప్పుడు చేసుకుంటూ వెళ్తే పాములు దగ్గరకు రావు. ఇంట్లో సాధ్యమైనంత వరకు మంచాలపై పడుకోవాలి. పాముకాటు వేసినప్పుడు ఎలాంటి ప్రయోగాలు చేయకుండా దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి ఏఎస్‌వీ ఔషధం తీసుకోవాలి.

రాత్రిపూట ఇబ్బందులు..

గ్రామీణ ప్రాంతాల ప్రజలే ఎక్కువగా పాముకాటుకు బలవుతున్నారు. జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి ఆస్పత్రులు అందుబాటులో ఉంటాయి. ఎవరైనా జగిత్యాల ఆస్పత్రికే తీసుకువస్తారు. పీహెచ్‌సీల్లో పాముకాటుకు సంబంధించిన మందులున్నా రాత్రివేళల్లో సిబ్బంది లేకపోవడంతో ఇబ్బందికరంగా మారింది.

మూఢ నమ్మకాలను వీడాలి

జిల్లాలో మూఢ నమ్మకాలు ఎక్కువగా నమ్ముతుంటారు. పాముకాటు వేస్తే గ్రామంలో పాముకాటుకు మందువేసే వ్యక్తులుగా పేరొందిన వారి వద్దకు వెళ్లి పాము మంత్రం వేయాలని కోరుతుంటారు. దీంతో అప్పటికే పరిస్థితి విషమించి ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే కొందరు మృత్యువాతపడుతున్నారు.

ఆస్పత్రికి తీసుకెళ్లాలి



పాముకాటు వేసిన వెంటనే చాలామంది తాడు కడుతుంటారు. దీంతో ఇబ్బందులు ఎదురవుతాయి. విషం సిరల్లోకి వెళ్తుంది. తాడు కట్టడం వల్ల ధమనుల్లోకి వెళ్లి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంటుంది. పీల్చడం గానీ, కట్ చేయడం గానీ చేయకూడదు. నేరుగా ఆస్పత్రికే తీసుకెళ్లాలి.

– వాసాల శ్రీధర్, ఎండీ

అన్ని పీహెచ్‌సీల్లో మందులు



అన్ని పీహెచ్‌సీల్లో పాముకాటుకు సంబంధించిన మందులున్నాయి. పాముకాటు వేసిన వెంటనే ఎలాంటి ప్రయోగాలు చేయకుండా ఆస్పత్రికి తీసుకురావాలి. రాత్రిపూట జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రి అందుబాటులో ఉంటుంది. ప్రతి పీహెచ్‌సీ, ప్రభుత్వ ఆస్పత్రుల్లో పాముకాటుకు సంబంధించిన మందులున్నాయి.

– పుప్పాల శ్రీధర్, డీఎంహెచ్‌వో


పట్టించుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యం

- సిరిసిల్లలోని ప్రజావాణికి పురుగుల మందు డబ్బాలతో వచ్చిన బాధితులు

సిరిసిల్లఅర్బన్: రోజులకొద్దీ ఆఫీస్‌ల చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని.. తమకు ఆత్మహత్యే శరణ్యమంటూ ఇద్దరు బాధితులు సోమవారం రాజన్నసిరిసిల్ల కలెక్టరేట్‌లోని ప్రజావాణికి వచ్చారు. తమ సమస్య పరిష్కరించకుంటే చావే దిక్కంటూ ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులు తెలిపిన వివరాలు. ముస్తాబాద్ మండలం చీకోడుకు చెందిన కొర్పెల్ల రాజిరెడ్డికి వారసత్వంగా వచ్చిన 37 గుంటల భూమి ఉంది. ఆ భూమిపై మార్టిగేజ్ రుణం తీసుకొని చెల్లించాడు. భూమి పత్రాలు ఇవ్వాలంటూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. విసిగివేసారిపోయిన రైతు రాజిరెడ్డి ప్రజావాణికి క్రిమిసంహారక మందుడబ్బాతో రాగా పోలీసులు అడ్డుకునే యత్నం చేశారు. గమనించిన అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ స్పందించి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఉద్యోగంలోకి తీసుకోండి..

వేములవాడకు చెందిన మహమ్మద్ అజామ్‌షరీఫ్ ఆదిలాబాద్ జిల్లాలో డీఆర్‌డీఏలో పన్నెండేళ్లు పనిచేసి అనారోగ్య సమస్యతో మానివేశాడు. అయితే మళ్లీ ఉద్యోగంలోకి తీసుకోవాలని ఆరేళ్లుగా తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదంటూ ప్రజావాణికి పురుగుల మందు డబ్బాతో రాగా గమనించిన సెక్యూరిటీ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు.



పురుగుమందు డబ్బాతో హాజరైన రైతు



బాధితుడిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ప్రాథమిక విద్య విద్యార్థి జీవితానికి పునాది

- డీఈవో జగన్మోహన్‌రెడ్డి

జగిత్యాలరూరల్: ప్రాథమిక విద్య విద్యార్థి జీవితానికి పునాది అని డీఈవో జగన్మోహన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట గ్రామ శివారులోని సూర్య గ్లోబల్ స్కూల్‌లో సోమవారం రిసోర్స్ పర్సన్లకు వివిధ అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. డీఈవో హాజరై మాట్లాడారు. ప్రాథమికస్థాయి విద్యార్థులు వారి స్థాయికి తగిన సామర్థ్యం సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న ఆకర్షణీయమైన అభ్యాస దీపికలు, పాఠ్య ప్రణాళికను ఆవిష్కరించామని, వాటిని సక్రమంగా ఉపయోగించుకుని ఉత్తమ బోధన చేయాలని సూచించారు. మండలస్థాయిలో ఉపాధ్యాయులకు వందశాతం శిక్షణ అందించాలన్నారు. తద్వారా విద్యార్థులు కనీస అభ్యాసన సామర్థ్యాలు సాధిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి కొక్కుల రాజేశ్, జిల్లా సమన్వయకర్త, కోర్సు డైరెక్టర్ తిరుకోవెల నరేందర్, రిసోర్స్ పర్సన్లు అభయ్‌రాజ్, మహేశ్, విజయ్, జయంత్, విజయనంద్, సురేందర్ పాల్గొన్నారు.



కరదీపిక ఆవిష్కరిస్తున్న డీఈవో జగన్మోహన్‌రెడ్డి

ముగిసిన టేబుల్ టెన్నిస్ పోటీలు



విజేతలతో టోర్నీ నిర్వాహకులు

కరీంనగర్ స్పోర్ట్స్: రెండు రోజులుగా కరీంనగర్‌లోని జీఎస్ టేబుల్ టెన్నిస్ అకాడమీలో నిర్వహిస్తున్న ఉత్తర తెలంగాణ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు సోమవారం ముగిశాయి. వివిధ జిల్లాలకు చెందిన దాదాపు 350 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. సాయంత్రం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ శరత్‌కుమార్ రెడ్డి హాజరై, విజేతలకు బహుమతి అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. కరీంనగర్‌లో మొట్టమొదటిసారి టేబుల్ టెన్నిస్ పోటీలు నిర్వహించడం అభినందించదగ్గ విషయమని పేర్కొన్నారు. పోటీల కో–ఆర్డినేటర్ మద్దెల వికాస్ మాట్లాడుతూ.. జీఎస్ అకాడమీ ఆధ్వర్యంలో టేబుల్ టెన్నిస్ క్రీడాకారులను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ గౌతమ్ రెడ్డి, పోటీల నిర్వాహకులు ఎస్.సురేందర్ సింగ్, కంకట అనూప్, ఆర్.నరేస్, పి.సత్యనారాయణ, శ్రీధర్, ఉపేందర్ కౌర్, ఎం.సంతోష్, జి.హర్ష, మణి, రాకేశ్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

అండర్–13 బాలుర విభాగంలో పి.జయంత్, చార్విక్(ఖమ్మం), ఎస్కే.దిల్షాన్(కరీంనగర్), బాలికల విభాగంలో అవనిరెడ్డి(కరీంనగర్), ఎస్.శివాని(ఖమ్మం), సత్య చతుర్వేది(మంచిర్యాల) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. అండర్–16 బాలుర విభాగంలో జ్వలిత్(ఖమ్మం), పి.అజయ్(కరీంనగర్), డి.గణేశ్(నిజామాబాద్), బాలికల విభాగంలో జి.సిరి(ఖమ్మం), వై.అన్విరెడ్డి(కరీంనగర్), సత్య చతుర్వేది(మంచిర్యాల), అండర్–19 బాలుర విభాగంలో ఎస్.జత్సింగ్, సాయితేజ, పి.అజయ్(కరీంనగర్), బాలికల విభాగంలో ఎం.అభిజ్ఞ(కరీంనగర్), ఎం.ధరణి(ఖమ్మం), వి.సిరి(ఖమ్మం), పురుషుల సింగిల్స్ విభాగంలో లోకేశ్(కొత్తగూడెం), సంతోష్(కరీంనగర్), శశికుమార్(ఖమ్మం), డబుల్స్ విభాగంలో రియాజ్ షేక్, లోకేశ్(కొత్తగూడెం), సంతోష్, పర్శరాం(కరీంనగర్), రవి, రమేశ్(వరంగల్), మహిళల సింగిల్స్ విభాగంలో ఎ.తన్మయి(వరంగల్), ఆర్.ప్రీతి(నిజామాబాద్), ఎం.అభిజ్ఞ(కరీంనగర్), డబుల్స్ విభాగంలో ప్రీతి, శ్వేత(నిజామాబాద్), అన్విరెడ్డి, ఎం.అభిజ్ఞ(కరీంనగర్), సింధు, శ్రావ్య(కరీంనగర్) మొదటి మూడు స్థానాలు సాధించారు.

మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించాలి



నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల ప్రతినిధులు

- ప్రజాసంఘాల నాయకుల డిమాండ్

కోరుట్ల: మణిపూర్‌లో జరుగుతున్న అల్లకల్లోల పరిస్థితులను చక్కదిద్దలేని ముఖ్యమంత్రిని పదవి నుంచి తొలగించి ఆ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని బస్టాండ్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం ఎస్ఎఫ్ఐ, సీఐటీయూ, టీజీఎస్, ఏడీడబ్ల్యూఏ, వడ్డెరవృత్తిదారుల సంఘం, కేవీపీఎస్, తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ప్లకార్డులలు ప్రదర్శించి పాలకుల తీరు ఎండగటాట్టరు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి తిరుపతి నాయక్ మాట్లాడుతూ మణిపూర్‌లో ఆదివాసీ మహిళలను నగ్నంగా ఊరేగించి, అత్యాచారం చేయడం దారుణమన్నారు. ఇప్పటికే వందమంది చనిపోయారని, రాష్ట్రంలో ఇంటర్‌నెట్ సేవలు నిలిపివేయడం ద్వారా అక్కడ ఏం జరుగుతుందో ప్రపంచానికి తెలియడం లేదని తెలిపారు. రెండు నెలలుగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నా ప్రధానమంత్రి పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా దుండగులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వై.పోషన, గుమ్మడి రమేశ్, రజియా సుల్తానా, పవిత్ర, పద్మ, వసంత, సన, కొండన్న, అంజత్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

'హామీలు అమలు చేయని సీఎం'

జగిత్యాలటౌన్: గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను సీఎం కేసీఆర్ తన హయాంలో అమలు చేయలేదని మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్ విమర్శించారు. మహిళలకు డబుల్‌బెడ్రూమ్ ఇళ్ల కేటాయించాలనే డిమాండ్‌తో స్థానిక తహసీల్ చౌరస్తాలో సోమవారం బీజేపీ శ్రేణులు ధర్నా చేశారు. నందీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ, హుజూరాబాద్ ఎన్నికల్లో ముదిరాజ్‌బంధు అని చెప్పిన కేసీఆర్ ఆ విషయమే మర్చిపోయారన్నారు. హుజూరాబాద్ ఉప ఎన్నిక సందర్భంగా ఆర్భాటంగా ప్రకటించిన దళితబంధు ఎందరికి వర్తింజేశారో వివరాలు వెల్లడించాలని కోరారు. ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తుండటంతో బీసీబంధు, మైనార్టీబంధు పేరిట ఓటర్లకు ఆశలు చూపి మళ్లీ గెలవాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని ఆయన అన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలు అమలు చేయాలని, ఇచ్చిన మాటప్రకారం అర్హులైన పేదలకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానం రద్దు చేయాలి

పెగడపల్లి(ధర్మపురి): సీపీఎస్ విధానం రద్దు చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) జిల్లా అధ్యక్షుడు బోనగిరి దేవయ్య డిమాండ్ చేశారు. సుద్దపల్లి, అయితిపల్లి, బతికెపల్లి, నందగిరి, ఆరవెల్లి, వెంగళాయిపేట, నంచర్ల, పెగడపల్లి పాఠశాలల్లో సోమవారం తపస్ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పీఆర్‌సీ కాలపరిమతి ముగిసినందున కొత్త పీఆర్సీ కోసం కమిటీ ఏర్పాటు చేసి, ఐఆర్ ప్రకటించాలని కోరారు. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ షెడ్యూల్ వెంటనే విడుదల చేయాలని. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, డీఎస్సీ ప్రకటించి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. తపస్ జిల్లా కార్యదర్శి తీగల శ్రీనివాస్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నేదరి లక్ష్మణ్, శ్రీరామోజు సత్యనారాయణ, గంగాధర మల్లేశం పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు చేయిస్తున్న నాయకులు

సమాజ హితం కోరేదే అసలైన కవిత్వం

కరీంనగర్‌కల్చరల్: భాష ఏదైన కవితాక్షరాలు సమాజ హితాన్ని కోరుతూ జాతిని జాగృత పరుస్తాయని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ తంగెడ కిషన్‌రావు అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలుగు విశ్వ విద్యాలయ ప్రాంగణంలో తెలంగాణ తెలుగు భాషా సంరక్షణ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి రచించిన మధు కవనం గ్రంథాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. మధు కవనం కవితా సంపుటిలో గ్రామీణ వాతావరణం బడుగుల బతుకు వెతలు, యువ చైతన్య అంశాలనే కవితా వస్తువులుగా చేసుకొని పామరులకు సహితం అర్థమయ్యేలా కవితలు పండించారని కొనియాడారు. వృత్తిరీత్యా రసాయనశాస్త్ర ఆచార్యులు అయినప్పటికీ తన గ్రామీణ నేపథ్యాన్ని ఆసరాగా చేసుకొని పలు కవితలు అక్షరీకరించడం ముదావహం అన్నారు. రచయిత, కవి, కాలమిస్టు బుర్ర మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ మన తీపి చేదు జీవన అనుభవాలను పునాదులుగా చేసుకొని సమాజ అవలక్షణాలు, సుగుణాలను తనదైన శైలిలో కవితాక్షరాల రూపంలో కవితలు రాయడం జరిగిందన్నారు. విశిష్ట అతిథులు ప్రముఖ సాహితీ దిగ్గజం దాస్యం సేనాధిపతి, నేటినిజం పత్రిక సంపాదకులు బైసా దేవదాసులు మాట్లాడుతూ వస్తు ఎంపికలో వైవిధ్యాన్ని పాటిస్తూ బుర్ర మధుసూదన్‌రెడ్డి కవిగా శిల్పంలో చతురత ప్రదర్శించారని అన్నారు. ఆత్మీయ అతిథి సాహితీవేత్త మచ్చ హరిదాసు మాట్లాడుతూ మధుసూదన్‌రెడ్డి కవిత్వంతో పాటు కాలమిస్టుగా నేడు తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ పేరును పొందడం సంతోషదాయకమన్నారు. మచ్చ హరిదాసు రచించిన మచ్చ వీరయ్య భక్తితత్వ ప్రకాశిక గ్రంథాన్ని వీసీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి జనంపూడి శ్రీలక్ష్మి, హాంకాంగ్ తెలుగు సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు పీచపాటి జయ, విశ్రాంత డీఈవో అనభేరి రాజేశ్వర్‌రావు, కవి బొమ్మకంటి కిషన్, అనుముల దయాకర్, సాహితీవేత్తలు తదితరులు పాల్గొన్నారు.



'మధు కవనం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కిషన్‌రావు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



గండికోట రాజం (ఫైల్)

కథలాపూర్(వేములవాడ): ద్విచక్రవాహనం అదుపుతప్పడంతో చెట్టును ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని చింతకుంట శివారులో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీమారం మండలం దేశాయిపేట గ్రామానికి చెందిన గండికోట రాజం (42) ఆదివారం మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్‌లోని బంధువుల ఇంటికి బైక్‌పై వెళ్లాడు. అదే రాత్రి తిరుగుప్రయాణంలో మండలంలోని చింతకుంట శివారులో బైక్ అదుపుతప్పి రోడ్డుపక్కన చెట్టును ఢీకొట్టగా రాజంకు తీవ్రగాయాలయ్యాయి. సోమవారం ఉదయం స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం మెట్‌పల్లిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఎల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు.

గురుకుల కళాశాలలో ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

సప్తగిరికాలనీ(కరీంనగర్): ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లో గల మహాత్మా జ్యోతిబాపూలే జూనియర్ కళాశాలలో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి మంగళవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ఆర్‌సీఓ గౌతంరెడ్డి తెలిపారు. కళాశాలలో సీట్లు కావాల్సిన వారు ఉదయం 11 గంటలకు ఆయా కళాశాలలోని ప్రిన్సిపాల్‌ను సంప్రదించి సీట్లు పొందాలని సూచించారు. అభ్యర్థులు ఆదాయం, కులం, ఆధార్ కార్డు, విద్యార్హతల సర్టిఫికెట్‌లతో హాజరుకావాలన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

మల్లాపూర్: మండలంలోని వేంపల్లి శివారులోని పౌల్ట్రీఫాంలో సోమవారం ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. వేంపల్లికి చెందిన కొంతమంది పేకాటాడుతున్నారన్న సమాచారం మేరకు పోలీస్ సిబ్బందితో దాడి నిర్వహించినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.6,2800 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గుడుంబా స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గుడుంబా

పెగడపల్లి: మండలంలోని మద్దులపల్లి గ్రామంలో గుడుంబా తయారీ స్థావరంపై ఎస్సై సతీశ్ ఆధ్వర్యంలో సోమవారం దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన గండికోట లచ్చయ్య గుడుంబా తయారు చేసి విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు లచ్చయ్య ఇంట్లో దాడులు నిర్వహించారు. 10 లీటర్ల గుడుంబా, 500 లీటర్లు సారా తయారీకి ఉపయోగించే బెల్లం పానకాన్ని ధ్వంసం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వరినారు ధ్వంసంచేసి విద్యుత్ మోటార్ చోరీ

కథలాపూర్(వేములవాడ): బీమారం మండలం రాగోజీపేటలో గుర్తు తెలియని వ్యక్తులు వరినారు ధ్వంసం చేసి విద్యుత్ మోటార్, స్టార్టర్ బాక్సులు ఎత్తుకెళ్లారని బాధిత రైతు దంపతులు బాలసాని సుశీల, నారాయణ సోమవారం తెలిపారు. గతంలో గుర్తు తెలియని వ్యక్తులు వరినారును ధ్వంసం చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. మళ్లీ అలాంటి ఘటనే జరిగిందని వాపోయారు. బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని మేడిపెల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు పేర్కొన్నారు.